10

# శ్రీ శేషుదేవులు తెలియచేసిన సత్యసూత్రములు - 1

## 1.అభిమానద్వేషాలను సత్యమార్గములోకి మార్చుకోవాలి

మనిషి పాపము చేయకపోయినా గానీ అభిమాన ద్వేషముల ద్వారా కూడా పాపఫలముతో సమానమైన దుష్ఫలమునే అనుభవించవలసి వస్తుంది. కావుననే ప్రతి మనిషి అభిమానమును భగవంతుని యెడల, సత్పురుషుల యెడల మరలించుకోవాలి. దానివలన సత్పురుషుల ఆత్మ మనకంటే పైన అత్యున్నత స్థితిలో ఉంటుంది కనుక నీరు పల్లమెరిగి నట్లుగ వారిలోని మంచి సంస్కారములే మనలోనికి వస్తాయి. అయస్కాంతము ఇనుమును లాక్కున్నట్లుగా మనలోని చెడ్డ సంస్కారములను ఆ సత్పురుషులు స్వీకరించి తమ ఆత్మ శక్తితో వాటిని దగ్ధం చేసేస్తారు. కావున ప్రతి వ్యక్తీ అభిమానముల విషయంలో చాలా అప్రమత్తముగా ఉండాలి. లోకములోని నాయకులను, కళాకారులను, క్రీడాకారులను అభిమానించువారు కూడా తద్వారా ఎంతో కొంత స్థాయిలో నష్టమునే పొందెదరు. అందుచేత లోక అభిమానములను ఎంటర్టైన్మెంటు మాత్రమే అని ఎంచి, కొద్ది స్థాయికే పరిమితం చేసుకోవాలి. అలాగే కుటుంబ బంధాల విషయములో కూడా వాటిని బాధ్యతగానే ఎంచి కూలికి బరువు మోసేవాని వలె బంధాల యెడల కూడా అభిమానములను అదుపులో పెట్టుకుని భగవంతునిపైకి అభిమానమును మరలించుకొనుటయే శాంతికరమైన మార్గమైయున్నది.

## 2.లోకము సత్యమును వ్యతిరేకిస్తుంది

బాహ్యమునకు, సత్యమునకు పొత్తు కుదరదు. నీతి, ధర్మమైనా గానీ సత్యము ఎదురుపడినప్పుడు వ్యతిరేకతనే కనబరుస్తాయి. అబ్రహామును, మోషేను పూజిస్తూ, ధర్మశాస్త్రాన్ని పాటిస్తూ, యూదుమత గురువులైయుండి కూడా సత్యము శ్రీ యేసుప్రభువు రూపములో ఎదురైనపుడు వారు ఆయనను వ్యతిరేకించి శిలువ వేసినారుకదా. శ్రీరాముడ్ని అప్పటి ప్రజలు అడవులకు పంపేసినారు. శ్రీ మహమ్మద్‌ను మక్కా నుండి మదీనాకు తరిమేసినారు. శ్రీ సాయిబాబాను ఆనాటి జనులు మాంత్రికునిగా, ధనాపేక్ష పరునిగా దూషిస్తూ, ద్వేషించినారు. ఏ కాలములో ప్రజలైనా గానీ సత్యము ఎదురైనపుడు వ్యతిరేకించుటయే జరుగుతుంది. సత్యము చేసే సేవను ఎవరూ గుర్తించలేరు. మనము కూడా సత్యమును వ్యతిరేకిస్తూనే ఉన్నామని, వ్యతిరేకిస్తామని గ్రహించుకుంటూ అప్రమత్తముగా ఉండాలి.



continue...

# 3.బహిర్గత చెడు కంటే అంతర్గత చెడుయే అధిక నష్టము

శ్రీ శేషబాబు గారికి చిన్నతనంలో డబ్బుని చూస్తే మనస్సు అశాంతికి లోబడిపోయేది. నిజాయితీ పరులైన వాళ్ళ నాన్నగారైన శ్రీ భైరవస్వామి గారు, అలాగే స్కూల్లో లెక్కలు చెప్పే మాష్టారు "డబ్బు పాపిష్టిది" అనేవారు. అది మనిషిలో చెడు ఆలోచనలను, చెడు కర్మలను ప్రోత్సహిస్తుంది అనేవారు. ఆ మాటలు ఆయన మనస్సులో బాగా నాటుకుపోయాయి.

ఎవరైనా బహిరంగముగా ధనమును లెక్కపెట్టుకొనుట చూచినా గానీ ఆయనకు అశాంతి వచ్చేసేది. జీవిత కనీస అవసరములకు మించి ధనమును లగ్గలీగ, వ్యర్థముగ ఖర్చుచేయుట, జిహ్వా చాపల్యమునకు లోనైపోయి అధిక రుచుల కొరకు పరిగెత్తుట కూడా త్రాగుడు,జూదము వంటి వ్యసనములేనని, వాటి వలన కూడా మనుష్యులు నష్టమునే పొందుతారని ఆయన చెప్పేవారు.

అలాగే ఎవ్వరిలోనైనా, ఎక్కడైనా చెడు కనిపిస్తే దానిని సహించలేకపోయేవారు, వారిని తీవ్రంగా విమర్శించేవారు. చెడును చూస్తే ఆయన ముఖం కోపంతో ఎర్రగా కందిపోయేది. చెడును చూడడంలో ఆయన బుద్ధి చాలా నిశితంగా పరిశీలించేది. పైకి చెడుగా కనిపించేవారిలోని చెడును అంటే అల్లరి చేష్టలు, వ్యసనాలు కలిగిన వారిని అంతగా పట్టించుకునేవారు కాదు. ఎందుచేతనంటే వాళ్ళ చెడు గురించి లోకానికి తెలిసిపోయేది కనుక వాళ్ళు చెడ్డవారు అనే పేరు లోకం ద్వారా వాళ్ళకు వచ్చేసేది. అయితే పైకి మంచిగా కనిపించి, అందరిచేత మంచి అనిపించుకుంటూ, మనస్సులో మానసిక వ్యభిచారాలు, అసూయ, ద్వేషం, అహంకారం, స్వార్థం, అందంపిచ్చి, కటుంబపిచ్చి, బంధుపిచ్చి, కులపిచ్చి, బాహ్య విషయాసక్తి మొదలైనవి కలిగియుండే వారిలోని ఈ అంతర్గత చెడును బాగా వ్యతిరేకించేవారు. పైకి మంచివారిగా లోకంచే బుద్ధిమంతులుగా గుర్తింపబడుచూ, వారి మనస్సులో ఉండే చెడును పైకి కనిపింపచేయక చెడును రహస్యంగా ఉంచుకునే వారే లోకానికి అధిక నష్టం కలిగిస్తారని చెప్పేవారు. ఎందుకంటే లోకం వారిని మంచి వారని నమ్ముతుంది. కనుక వారిలోని చెడువలన వారే లోకాన్ని అధికముగా మోసం చేసేవారు. అంతేకాకుండా వారు వారి మనస్సుకు, ఆత్మకు కూడా తీవ్ర నష్టాన్ని కలిగించుకుంటున్నారని చెప్పేవారు.

 continue..

# 4.దేవుడు ఉన్నాడనుకుంటేనే సమాజం బాగుంటుంది

కాలేజీలో ఒకసారి ఒకమాష్టారు దేవుడు ఉన్నాడా ? లేదా ? అని అడిగినారు. దానికి చాలామంది విద్యార్థులు 'ఉన్నాడు' అన్నారు. దానికి ఆయన నేను 'లేదు' అంటాను, ఉంటే మీరు చూపించండి అన్నారు. దానికి ఎవ్వరూ మాట్లాడలేదు. అపుడు శ్రీ శేషబాబు గారు లేచి, "సార్ దేవుడు ఉన్నాడో లేడో నాకూ తెలియదు. అయితే మనిషి దేవుడు ఉన్నాడు అని, ఆయన మనం తప్పులు చేస్తే శిక్షిస్తాడు, మంచి చేస్తే మేలు చేస్తాడు అని భావించడం వలన మనిషి పాపాలు చేయడానికి భయపడతాడు. దానివలన సమాజంలో అరాచకం ప్రభలదు. అయితే మనిషి దేవుడు లేడు అనుకుంటే, మనం తప్పుచేసినా పట్టించుకునేవాడు లేడని అరాచకాలు, అక్రమాలు చేసేస్తాడు. దానివలన సమాజం అల్లకల్లోలం అవుతుంది. కాబట్టి మనం చూసినా చూడకపోయినా ఆయన ఉన్నాడనుకోవడంలోనే పాపభీతితో సమాజం బాగుంటుది" అన్నారు. దానికి మాష్టారు కరెక్టుగా చెప్పావు నీ అభిప్రాయంతో నేనూ ఏకీభవిస్తున్నాను అని అన్నారు.

# 5.ఆస్తికులు-నాస్తికులు

ఒక సందర్భంలో "ఆస్థికులు – నాస్థికులు" గురించి సంభాషణ వచ్చినప్పుడు దానికి శ్రీ శేషబాబు గారు ఇలా చెప్పేవారు. "దేవుడు లేడు అంటూ, మానవత్వం లేకుండా, పేదప్రజలపై అభిమానం, ప్రేమ లేనివారే నిజమైన నాస్థికులు. అలాగే దేవుడు ఉన్నాడంటూ దేవుని పూజిస్తూ కూడా మానవత్వం లేకుండా పేదప్రజలను దోచుకునేవారు, అక్రమ సంపాదన చేస్తూ తమ భార్యాబిడ్డలు, కుటుంబ స్వార్థం గురించి పాటుబడుచూ మతపిచ్చి, కులపిచ్చి కలిగినవారు కూడా నాస్థికులే అనేవారు. ఇక నిజమైన ఆస్థికులు ఎవరంటే, దేవుడు ఉన్నాడని మతరహితముగా దేవుని పూజిస్తూ పేదప్రజలను అభిమానిస్తూ, దానధర్మాలు చేస్తూ నిజాయితీగా సంపాదించేవారే నిజమైన ఆస్థికులు. వాళ్ళ తర్వాత దేవుడు లేడన్నా కూడా మానవత్వాన్ని కలిగియుండి, మతరహితముగా, కుల రహితముగా పేద ప్రజలను అభిమానించి, వారికి సేవచేసి వారి కొరకే పోరాడే కమ్యూనిష్టులు కూడా ఆస్థికులే" అనేవారు.

continue...

# 6. నిస్వార్ధ సేవ

శ్రీ శేషబాబుగారు సినిమాలు చూచేవారు. ఆయనకు యువతీ యువకుల మధ్యన ఉండేదే నిజమైనప్రేమ అని భ్రమిస్తూ అట్టి ప్రేమ విఫలం అయితే త్రాగుడికి అలవాటు పడి జీవితం నాశనం చేసుకునే సినిమాలు, ప్రియురాలిని దేవతగా ఆరాధించి వారికి మందిరాలు కట్టించే సినిమాల్లాంటివి నచ్చేవికావు. యువతీయువకుల మధ్య ఉండేది ఆకర్షణ, కామమే తప్ప అది నిస్వార్థ ప్రేమకు చాలా దూరంగా ఉందనేవారు. తల్లిదండ్రులను, అన్నదమ్ములను, అక్కచెల్లెళ్ళు, పెద్దలు మొదలగు వారిని అందరిని విడనాడి, అన్యోన్యంగా ప్రేమతో పెంచి పెద్ద చేసిన వారి ప్రేమను విడనాడి ప్రియురాలి కోసమో, భార్యాబిడ్డల కోసమో వారిని వదలివేయడం తమ స్వార్థం తాము చూసుకోవడం ఆయనకు నచ్చేది కాదు. కుటుంబ బంధాలలో ఉండే ప్రేమలలో భార్యాభర్తలకు, ప్రేయసీ ప్రియులకు మధ్య ఉండే ప్రేమయే అల్పమైనదిగా ఆయన భావించేవారు. కుటుంబ బంధాలకన్నా ఊరి మంచి కోసం నిస్వార్థంగా పాటుబడేవారు, అన్యాయాన్ని ఎదిరించి న్యాయం కోసం పోరాడే వారు గొప్పవారు. వీరికన్నా రాష్ట్రం కోసం, వీరి కన్నా దేశం కోసం, వీరి కన్నా ప్రపంచ ప్రజల కోసం నిస్వార్థంగా సేవ చేసేవారి సేవ గొప్పది వారిదే నిజమైన ప్రేమ. వారి యొక్క ప్రేమ పరిధి విశాలంగా ఉంటుంది అని చెప్పేవారు. అయితే అట్టి సేవలో కులాభిమానం గానీ, మతాభిమానం గానీ, ప్రాంతీయాభిమానం గానీ కలవకుండా చూసుకోవాలి. అటువంటి బాహ్య అభిమానాలు కలిస్తే అట్టి ప్రేమ, సేవలు కలుషితం అయిపోయి ఘర్షణలకు దారితీస్తాయి అని చెప్పేవారు.

# 7. చెడునైనా అవసరమైనంత మేరకే ద్వేషించాలి

ద్వేషమును గూర్చి శ్రీ గురుదేవులు ఇలా చెప్పియున్నారు, "ప్రతి వ్యక్తిలోను, ప్రతి పరిస్థితిలోను మంచి–చెడు రెండూ ఉంటాయి. ప్రపంచములో అనేక రకాలైన పెద్ద పెద్ద చెడులు ఉన్నవి. వాటినన్నింటినీ ద్వేషిస్తూ కూర్చుంటే మన జీవితమంతా దానికే సరిపోతుంది. మనలోని చెడును, మన బంధాలలోని చెడును, మనకు సంబంధించిన వారిలోని చెడునే విమర్శించుకోవాలి. మిగతా చెడులను మనము పట్టించుకోనవసరము లేదు. అలాగే ఏదైనా చెడును మనము అభిమానిస్తుంటే ఆ అభిమానము మనలోనుండి పోయేదాకా ఆ చెడును మనము విమర్శించాలి, ద్వేషించాలి. ఆ అభిమానము మనలోనుండి పోయినాక ఇంక ఆ చెడును ద్వేషించరాదు. నా శిష్యులలో ఎవ్వరిలోనైనా చెడుపై అభిమానము ప్రవేశించిందంటే నేను ఆ చెడును తీవ్రముగా విమర్శిస్తాను, ద్వేషిస్తాను. వారి నుంచి ఆ చెడు అభిమానము తొలగే వరకు విమర్శిస్తాను. అది తొలగిపోయినాక ఇంక ఆ చెడును విమర్శించను, ద్వేషించను. నిజానికి నాలో ఏ విధమైన చెడుపైన అభిమానము లేదు. ఆత్మవిమర్శతో నాలోని చెడునంతటినీ నేనెప్పుడో దహింపచేసినాను. కావున నేను ఎవ్వరిలోని చెడును విమర్శింపవలసిన, ద్వేషింపవలసిన అవసరము నాకు లేదు. ద్వేషాన్ని వహించుట నాకు అనవసరభారమే. కానీ మీ కోసమే నేను చెడును విమర్శిస్తాను, ద్వేషిస్తాను. మీరు చేసుకోవలసిన ఆత్మవిమర్శను మీ తరపున, మీ కొరకు నేను చేసిపెట్టుటకే నా విమర్శ నా ద్వేషము అయియున్నవి" అని శ్రీ గురు దేవులు చెప్పియున్నారు.



continue...

## 8. దైవవిగ్రహాలను పువ్వులతో అలంకరించాలి

శ్రీ శేషుబాబుగారికి చిన్నతనం నుండి ధనం పాపిష్టిది అనే భావము మనస్సులో ముద్రపడిపోయియుండేది. డబ్బును చూచుట గానీ, తాకుటగానీ చేయలేకపోయేవారు. డబ్బును చూస్తే పామును చూచినట్లుగ బాధపడేవారు. శ్రీ శేషుబాబుగారికి డబ్బుని బహిరంగంగా అందరికీ కనిపించేటట్టు లెక్కించడం గానీ, ఇతరులకు కనిపించే విధంగా జేబులో డబ్బు పెట్టుకోవడం గానీ ఇష్టం ఉండేది కాదు. దానివలన ఇతరులకు చెడు ఆలోచనలు, ఆశ పుట్టి తప్పుడు పనులు చేయడానికి అవకాశం ఉందనేవారు. అలాగే దేవాలయాలలో దైవ విగ్రహాలను బంగారు ఆభరణాలతో, వజ్రాలు మొదలగు వాటితో అలంకరించడం, అలాగే రూపాయి నోట్లతో దండలు వేయడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ఎందుకంటే అట్టి దైవవిగ్రహాలను దర్శించుకునే వారిలో అట్టి విగ్రహంపై కాకుండా విగ్రహాన్ని అలంకరించిన విలువైన వస్తువులపై ఆకర్షణ కలిగి, మనస్సుచెడి, చెడుతలంపులు వస్తాయనేవారు. విగ్రహాలను నిరాడంబరంగానే ఉంచడానికి ఇష్టపడే వారు. ఒకవేళ విగ్రహాన్ని అలంకరించాలనుకుంటే పూలదండలతోను, పూలతోను, మంచి వస్త్రాలతోను అలంకరిస్తే మంచిది అనేవారు.

## 9.విధి కంటే దేవునిప్రేమ బలీయమైనది

శ్రీ శేషుబాబు గారికి తన జీవిత అనుభవాన్నిబట్టి మనిషి తెలిసిగానీ, తెలియకగానీ తప్పు చేసినా వాటిగురించి తెలుసుకుని పశ్చాత్తాపంతో భగవంతుని దగ్గర ఒప్పుకుంటే, అట్టి పాపఫలం విధిచేత అనుభవించకుండా భగవానుని అనంతమైన జాలి, ప్రేమ కాపాడతాయి అని అర్థం అయింది. దీని వలన విధివ్రాతే ఎంతో బలీయమైనదని అది ధర్మబద్ధంగా, న్యాయబద్ధంగా పక్షపాత రహితంగా పరిపాలిస్తుందని, అయితే విధికన్నా బలీయమైనది భగవంతుని యొక్క జాలి, ప్రేమ అని అర్థమయింది. భగవంతుని యొక్క అనంతమైన జాలి, ప్రేమ మంచివారిపైనే కాకుండా పాపులు, మహాపాపులపైన కూడా సమానంగానే ఉంటుందని, పాపులు మహాపాపులు తాము చేసిన పాపాలను గురించి పశ్చాత్తాపంతో వాటిని భగవంతుని దగ్గర ఒప్పుకుని తిరిగి వాటిని చేయకపోతే, వారు కూడా విధియొక్క శిక్ష నుండి తప్పించుకుని భగవంతుని యొక్క జాలి, ప్రేమ వలన శాంతి, సుఖం, ఆనందం పొందుతారని గ్రహించారు. అయితే పాపకర్మలు చేసి వాటికి పశ్చాత్తాపపడక, ఇంకా అట్టి పాపకర్మలు చేస్తూ ఇతరులను బాధించే వారి పరిస్థితి ఏమిటని శ్రీ శేషుబాబు గారు తన చుట్టూ ఉన్న వ్యక్తులను సమాజంలోని వ్యక్తులను పరిశీలించేవారు. అలాంటివారు బాహ్యంగా గొప్పస్థితిలో ఉన్నట్టుగా కనిపించినా, వారు అనారోగ్యం, దురదృష్టం, అశాంతివంటి అనేక కుటుంబ సమస్యలతో, భార్యాబిడ్డలు సక్రమ ప్రవర్తన కలిగి ఉండకపోవడం లేదా వారు అనారోగ్యవంతులు, అసమర్థులు కావడం, వెర్రిబాగులతనం మొదలైనవి కలిగి ఉండి విధిచేత శిక్షించబడడం గమనించేవారు. చాలా మంది పాపం చేసినవారు బాహ్యంగా కూడా దారిద్ర్యం, అనారోగ్యం, అపకీర్తి, దురదృష్టం మొదలగు వాటిని అనుభవిస్తూ అశాంతితో, దుఃఖంతో జీవించడము గమనించేవారు.



continue...

అపుడు శ్రీ శేషబాబుగారు పాపాలు చేసి వాటిని తెలుసుకొనక పశ్చాత్తాపం లేక పాపాలు ఇంకా కొనసాగిస్తూ ఉండేవారి విషయంలో విధి వారిని ధర్మబద్ధంగా, న్యాయబద్ధంగా శిక్షిస్తుంది అనే సత్యము కూడా నిజమేనని, అంటే భగవంతుడు దుష్టులను శిక్షించడం, మంచివారిని రక్షించడం దానితో ఈ మానవ సమాజాన్ని న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా ఏ పక్షపాతం లేకుండా వారు చేసుకున్న పాప–పుణ్య కర్మలను బట్టి పరిపాలించే ఒక శక్తి ఉన్నదని, దానినే భగవంతుడు అన్నారని, ఆయన శిక్ష కూడా జాలి, ప్రేమలతో కూడి ఉంటుందని తెలుసుకున్నారు. ఇలా ప్రభువు చరిత్రను బట్టి మనుజులు తెలిసిగానీ, తెలియక గానీ తప్పులు చేసినను వాటిని తెలుసుకుని పశ్చాత్తాపంతో భగవంతుని వద్ద ఒప్పుకుంటే వాటిని తన అనంతమైన జాలి, ప్రేమలతో క్షమించి, వారిని విధియొక్క శిక్ష నుండి తప్పించే శక్తి భగవానుని జాలికి, ప్రేమకి ఉందని, ఇట్టి భగవానుని యొక్క అనంతమైన జాలి, ప్రేమలతో నిరాకారంగా ఈ మానవ సమాజాన్ని, ఈ సృష్టిని పరిపాలించే ఒక శక్తి ఉన్నదని తెలుసుకుని చాలా ఆనందించారు.

# 10. సృష్టిలో బాధ స్వల్పమైనదే

ఈ సృష్టి ఎందుకు ? అందరూ బాధపడుచున్నారు కదా ! ఈ సృష్టిని ఇంతకంటె బాగుగ బాధలు లేని సృష్టిగా సృష్టించవచ్చును కదా ! అని కొందరు భావిస్తుంటారు.

ఈ సృష్టి లేకుంటే కథలేదు. సృష్టిలో దేహమును ధరించియున్న ఆత్మలు, దేహమును వదిలిన (స్థూలశరీరము కలిగిన) ఆత్మలు మాత్రమే బాధను కలిగియున్నవి. మిగిలిన ఆత్మలకు బాధలేదు. (ముక్తిపొంది) నాలో కలిసిపొయిన ఆత్మలకు నేను మరింత చేరువగా ఉంటున్నాను. బాధను కలిగియున్న ఆత్మలను నేను అమితముగా ప్రేమించుచున్నాను. వాటిని బాధ నుండి విముక్తము చేయుటకు ప్రేమతో ప్రయత్నము చేయుచున్నాను.

బాధ నుండి విముక్తి పొందిన ఆత్మలు సృష్టి ఉండాలనే అనుకుంటాయి. బాధపడుచున్న ఆత్మలు (ఈ సృష్టి ఎందుకు ? అంటూ) సృష్టిని వ్యతిరేకించుచున్నవి. ఈ బాధ ఒకవైపు నుండి చూస్తే స్వల్పమే అనిపిస్తున్నది. మరొక వైపు నుండి చూస్తే అధికముగా అనిపిస్తున్నది. నిజమునకు బాధ స్వల్పమే. సృష్టిలో (అన్ని లోకములలో) ఉన్న ఆత్మలతో పొల్చితే, బాధను అనుభవించుచున్న ఆత్మలు కూడా స్వల్పమే. బాధ నుండి విముక్తి పొందిన ఆత్మలు మరల దేహమును ధరింపగలవా? బాధను అనుభవింపగలవా ? (ముక్తి పొందిన పిదప బాధ అనే అనుభూతిని పొందలేవని అర్థము)

continue..

## 11. అద్భుతములు కంటె ఆత్మాభివృధి విలువైనది

అద్భుతములు ఆత్మస్థితిని మార్చవు. అద్భుతములు ఆశించువారు ఆత్మస్థితిలో మార్పును మరచిపోవుచున్నారు. అద్భుతములు చేయు అనేక ఆత్మలు (నిరాకార శక్తులు) ఆత్మస్థితిని మార్పు పొందుటకు నన్ను ఆశించుచున్నవి. నన్ను, నా రూపమును పూజించుచున్న వారి యందు నిరాకారశక్తులు అద్భుతములు చేయుచున్నవి.

అద్భుతములు చేయు మార్గము విశాలమైనది. అందుపోవువారు ఎందరో. ఆత్మస్థితిని మార్పు చేయు మార్గము ఇరుకైనది. అందు పోవువారు కొందరే. ఆత్మస్థితిలో మార్పు కలిగించునది నమ్మకము.

## 12. విశ్రాంతిప్రదాత శ్రీశేషుదేవులు

సర్వకాల సర్వావస్థలయందును నేను భగవంతుడననే భావముతో నా నామమును స్మరించుకోండి (నన్ను స్మరించినచో) నేను మీవద్ద ఉంటాను (నేను ఉన్నచోట) మీకు విశ్రాంతి కలుగుతుంది.

*****